## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 09-11-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ సులభతర వాణిజ్యంలోనూ, అంకుర సంస్థల స్థాపనలో ఉత్తరాఖండ్ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపామని నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- ❖ ఆవిష్కరణలు, పరిశోధనలతో విద్యా సంస్థలు తమ సామర్థ్యాన్ని ఉపయోగించుకోవాలని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ కోరారు.
- ❖ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు 5.75 లక్షల కోట్ల రూపాయల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు.
- ❖ పంజాబ్‌లోని ధాన్యాగారాల ద్వారా ఇప్పటివరకూ 126 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరాఖండ్ వివిధ రంగాల్లో అగ్రగామిగా ఉందని, అభివృద్ధిలో అత్యుత్తమ ప్రగతి సాధించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. ఈ రోజు ఉత్తరాఖండ్ 25వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. 2023-2024 భారత్ స్థిరమైన అభివృద్ధి సూచీలో ఉత్తరాఖండ్ రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని ప్రధానమంత్రి అన్నారు. సులభతర వాణిజ్యంలోనూ, అంకుర సంస్థల స్థాపనలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపామని నరేంద్రమోదీ పేర్కొంటూ...

(వాయిస్ 41 సెకన్లు)

ఇదిలా ఉండగా ఉత్తరాఖండ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖర్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఉత్తరాఖండ్ ప్రజలకు సామాజిక మాధ్యమ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వ రంగ బ్యాంకులు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు 5.75 లక్షల కోట్ల రూపాయల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. బెంగళూరులో ఈరోజు భారతీయ చిన్న తరహా పరిశ్రమల బ్యాంక్ నిర్వహించిన జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు చేరువ చేసే క్లస్టర్ కార్యక్రమంలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ పరిశ్రమలకు ప్రభుత్వ రంగ బ్యాంకుల రుణాలు 9.2 శాతం పెరిగాయని, ప్రైవేట్ బ్యాంకుల నుండి 25 శాతం బ్యాంకింగేతర ఆర్థిక కంపనీల ద్వారా 39 శాతం పెరిగాయన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విద్యను ఎప్పుడూ వ్యాపారంగా చూడరాదని, సమాజానికి మంచిని తిరిగిచ్చే బాధ్యతగా, కర్తవ్యంగా భావించాలని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ 4వ స్నాతకోత్సవంలో ఈరోజు ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యలో పెట్టుబడి మానవ వనరులను సుసంపన్నం చేయడంతో పాటు వర్తమాన, భవిష్యత్తులలో సమాజానికి సేవ చేసేందుకు అత్యంత ప్రభావవంతమైన మార్గంగా ఉంటుందన్నారు. ఆవిష్కరణలు, పరిశోధనలతో విద్యా సంస్థలు తమ సామర్థ్యాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. పరిశోధన, ఆవిష్కరణల రంగాల్లో ఒక దేశం సాధించిన ప్రగతి ద్వారానే తన నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటుతుందని ఉపరాష్ట్రపతి పేర్కొంటూ..

(వాయిస్ 45 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పంజాబ్‌లోని ధాన్యాగారాలకు 126 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం చేరిందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇందులో 120 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా రాష్ట్ర ఏజెన్సీలు, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సిఐ) ద్వారా సేకరించబడ్డాయి. గ్రేడ్ 'ఎ' ధాన్యం క్వింటాల్‌కు 2,320 రూపాయల కనీస మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నామని వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రస్తుత ఖరీఫ్ కాలంలో ఇప్పటి వరకు ప్రభుత్వం 27,995 కోట్ల రూపాయల ధాన్యం కొనుగోలు చేయగా, తద్వారా 6 లక్షల 58 వేల మంది రైతులకు లబ్ధి చేకూరింది. ఇదిలా ఉండగా ఈ నెల 30వ తేదీ వరకు 185 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహారాష్ట్రలోని మరఠ్వాడా ప్రాంత అభివృద్ధికి మహాయుతి కూటమి కృషి చేసిందని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఈ రోజు జరిగిన ఎన్నికల ప్రచార సభలో నరేంద్రమోదీ ప్రసంగిస్తూ... గత రెండున్నర సంవత్సరాల్లో మరాఠ్వాడా ప్రాంతంలో 80 వేల కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు వచ్చాయన్నారు. ఈ ప్రాంతంలో అభివృద్ధి చేసిన 11 సాగునీటి ప్రాజెక్టులను ఆయన ప్రస్తావించారు. ఢిల్లీ - ముంబై ఇండస్ట్రియల్ కారిడార్, రైల్ కోచ్ ఫ్యాక్టరీ, లాజిస్టిక్ పార్క్ లు, వంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని నరేంద్ర మోడి పేర్కొన్నారు. ఇదిలా ఉండగా మహారాష్ట్రలో శాసనసభ ఎన్నికలతో పాటు నాందేడ్ లోక్‌సభ స్థానానికి కూడా ఈ నెల 20వ తేదీన ఉప ఎన్నికలు జరగనున్నాయి.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దీపావళి, ఛత్ పండుగల సందర్భంగా భారతీయ రైల్వే 7724 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఇందులో భాగంగా తూర్పు కోస్తా రైల్వే ప్రయాణీకుల దర్ఢీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. విశాఖ చెన్నై ఎక్స్ ప్రెస్ విశాఖలో రాత్రి 7 గంటలకు బయలుదేరుతుందని అధికారులు తెలిపారు. అలాగే విశాఖపట్నం - భువనేశ్వర్ ల మధ్య ప్రత్యేక రైలు

మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరిందని, తిరుగుపయనంలో భువనేశ్వర్ నుండి రాత్రి 10 గంటల 30 నిమిషాలకు ప్రారంభమవుతుందని అధికారులు వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరప్రదేశ్ ఫిరోజాబాద్ జిల్లాలోని ఆగ్రా - లక్నో ఎక్స్‌ప్రెస్ వే పై ఈ రోజు ఆగి ఉన్న వాహనాన్ని బస్సు ఢీ కొనడంతో 5 మంది మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. ఫిరోజాబాద్ పోలీస్ సూపరింటెండెంట్ అఖిలేష్ భదోరియా తెలిపిన వివరాల ప్రకారం, బస్సు మధుర నుండి లక్నో వెళ్తుండగా ఆగ్రా - లక్నో ఎక్స్ ప్రెస్‌వేపై థానా నసీర్‌పూర్ సమీపంలో ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత ఆటగాడు పంకజ్ అద్వానీ IBSF ప్రపంచ బిలియర్డ్స్ ఛాంపియన్‌షిప్ 150 అప్ ఫార్మాట్ టైటిల్‌ను గెలుచుకున్నారు. ఖతార్‌లోని దోహాలో ఈ రోజు జరిగిన టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ లో పంకజ్ అద్వానీ ఇంగ్లాండ్‌కు చెందిన రాబర్ట్ హాల్‌ను ఓడించారు. అంతకుముందు జరిగిన సెమీఫైనల్‌లో భారత్ కే చెందిన పంకజ్ సౌరవ్ కొఠారీని పంకజ్ అద్వానీ 4-2 తేడాతో ఓడించాడు. సౌరవ్ కాంస్య పతకం గెలుచుకున్నాడు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్‌లలో ఈరోజు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం తెలియజేసింది. ఈ నెల 12వ తేదీ వరకు ఆయా ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కేరళ, మహే, కోస్తా ఆంధ్ర ప్రదేశ్, యానాం, రాయలసీమలలో కూడా 4 నుంచి 5 రోజులలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. హిమాచల్ ప్రదేశ్‌లో రానున్న 2 రోజుల పాటు ఉదయం వేళల్లో దట్టమైన పొగమంచు కమ్ముకునే అవకాశం ఉందని, రాబోయే 5 రోజులలో పశ్చిమ హిమాలయ ప్రాంతంలో కనిష్ట ఉష్ణోగ్రత క్రమంగా 2నుండి 4 డిగ్రీల సెల్సియస్ తగ్గుతుందని పేర్కొంది. బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలు, ఉత్తర శ్రీలంక తీరం, పరిసర ప్రాంతాల్లో రానున్న 2 రోజుల్లో ఉరుములతో కూడిన వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని, మత్స్యకారులు ఈ ప్రాంతాల్లో వేటకు వెళ్లవద్దని వాతావరణ శాఖ సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత పురుషుల హాకీ జట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్ సింగ్ 2024 సంవత్సరానికి గానూ FIH ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును, కైవసం చేసుకున్నారు. అలాగే మాజీ గోల్‌కీపర్ PR శ్రీజేష్, FIH గోల్ కీపర్ ఆఫ్ ది ఇయర్ టైటిల్‌లను గెలుచుకున్నారు. ఒమన్‌లో జరిగిన 49వ FIH సమావేశంలో వీరిద్దరికి పురస్కారాలను ప్రధానం చేశారు. నిపుణుల ప్యానెల్, జాతీయ హాకీ సంఘాలు, అభిమానులు, పాత్రికేయులతో  కూడిన ఓటింగ్ ప్రక్రియ ద్వారా నిర్వాహకులు విజేతలను ఎంపిక చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

యూనివర్సిటీల జాబితాలో ఏడు భారతీయ యూనివర్సిటీ చోటు సంపాదించాయి. మొదటి 50 యూనివర్సిటీల జాబితాలో రెండు భారతీయ యూనివర్సిటీలు, మొదటి 100లో ఏడు విశ్వవిద్యాలయాలు చోటు సంపాదించాయి. ఢిల్లీ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ 44వ స్థానంలో నిలిచింది. ఐఐటీ బాంబే 48వ స్థానంలో నిలిచింది. ఇదిలా ఉండగా మొదటి 100 స్థానాలలో చోటు సంపాదించుకున్న భారతీయ యూనివర్సిటీలలో IIT మద్రాస్, IIT ఖరగ్‌పూర్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, IIT కాన్పూర్, యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ ఉన్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =